క్లుప్తంగా

మురుగునీరు పోయే మార్గం ఏర్పాటు చేయండి



గుడివాడ టౌన్: స్థానిక న్యూ ఇందిరానగర్ కాలనీలో మురుగు నీరు బయటకు పోయే మార్గం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి కోరారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో నిలిచిపోయిన వర్షపు నీటిలో నిలిచి మంగళవారం ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 ఏళ్లక్రితం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో నిర్మించిన ఈ కాలనీకి మురుగునీరు పోయే సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ కాలనీలో వర్షంవస్తే మురుగు, వర్షపునీరు కలిసి రోడ్లపై నిలిచిపోతాయన్నారు. మురుగు నీరు పోవడానికి బేతవోలు వద్ద శ్యామలకోడు, పారుపూడి నుంచి వచ్చే మురుగుకాల్వ రెండూ అందుబాటులో ఉన్నా సరైన విధానంలో డ్రైయినేజీ వ్యవస్థ నిర్మించక పోవడంతో ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. మురుగునీరు తరలించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఐద్వా కార్యదర్శి రజిని, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనం అందజేత



జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీ దగ్గుమిల్లిలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సూచనల మేరకు టీం బాలశౌరి యువత తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. యువత ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం తెల్లవారు జామునుంచి ఆహారాన్ని వరద బాధితుల కోసం వండించారు. అనంతరం వాటిని తోట్లవల్లూరు మండలంలోని వల్లూరిపాలెంలో సహాయ శిబిరాల్లో ఉన్న వరద బాధితులకు మధ్యాహ్న భోజనంగా అందజేశారు.

దుప్పట్ల పంపిణీ



పెదపారుపూడి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి నీళ్లు వెళ్లి ఇబ్బంది పడుతున్న బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. పెదపారుపూడి, మోపర్రు, గ్రామాల్లో ముంపు బాధితులను మంగళవారం ఆయన మంగళవారం పరామర్శించారు. పెదపారుపూడి నడుము కోడ్ డ్రెయిన్‌పై ఉన్న 15 బాధిత కుటుంబాలకు సర్పంచ్ చప్పిడి సమీరాతో కలిసి నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. మోపర్రులో వన్నేరు డ్రెయిన్ పొంగి వరద నీరు ఇళ్లలోకి రావటంతో ఎమ్మెల్యే పరామర్శించి, దుప్పట్లు అందజేశారు.

ఏపీటీఎఫ్ పోరాటం

ముదినేపల్లి రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఏపీటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ సంఘ మండల ప్రధాన కార్యదర్శి డి.వెంకటరత్నం అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆ సంఘ జిల్లా నాయకుడు జాన్సన్ బాబు, రవికుమార్, శివ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

జురుపవరం(పామర్రు): మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పామర్రు ఐసీడీఎస్ సీడీపీఓ వీ భానుశ్రీ అన్నారు. మండలంలోని జురుపవరం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మహిళలు వారి చిన్నారులకు పోషకాహారాలను అందిస్తూ, వారి విద్యపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ ఎన్‌సత్యశ్రీ, గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మీ, రాజశ్రీ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

పెదపారుపూడి: గర్భిణులు పోషకాలతో ఉన్న ఆహారం తీసుకుంటే రక్తహీనత గురికాకుండా ఉంటారని అంగన్‌వాడీ వెంట్రప్రగడ సెక్టర్ సూపర్‌వైజర్స్ ఎం.శివనాగమణి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

బరువు తక్కువ పిల్లలపై శ్రద్ధ

పెదమద్దాలి(పామర్రు): బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి అన్నారు. మండలంలోని పెదమద్దాలి గ్రామశివారు కొండాయపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా గ్రోత్ మానిటరింగ్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ బరువు చిన్నారులకు సమతుల ఆహారం ఇవ్వాలన్నారు. చిన్నారుల ఆరోగ్యం వారి బరువుపై ఆధార పడి ఉంటుందని, కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి.జ్యోత్స్న, కె.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆశలు వరద పాలు

ముంపులోనే వరి పొలాలు

గుడివాడ నియోజకవర్గంలో వర్షాలు తగ్గినా బుడమేరు, చంద్రయ్య, భూమికోడు, నెహ్రూల్లీ, మోటూరు ఎల్ఎస్ డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. ఆయా పరిసర ప్రాంతాల్లోని వరి పంట పొలాలు నీటిలోనే నానుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



గుడివాడ మండలంలో నీట మునిగిన పంట పొలాలు

గుడివాడరూరల్: బుడమేరు ఉధృతికి పుట్టగుంట, చిన లింగాల, చేదుర్తిపాడు, అరిపిరాల, రామాపురం, ఇలపర్రు, కుదరవల్లి గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. వరద నీరు పంట పొలాల్లో చేరి పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఎనిమిది వేల ఎకరాలు నీట మునిగాయని అంచనా రూపొందించారు. అయితే సుమారు 14వేల ఎకరాలకు పైగా పంట పొలాలు ఇంకా నీటిలో ఉన్నాయని ఆయా ప్రాంతాల్లోని రైతులు వాపోతున్నారు. సమగ్ర అంచనాలు రూపొందించి నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. పంట పొలాల్లో ఉన్న నీరు బయటకు పోయేవిధంగా ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి కూడా చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అధిక మొత్తాల్లో పెట్టుబడులు పెట్టి వరి సాగు చేశామని, భారీ వర్షాలతో పంట పూర్తిగా నష్టపోతున్నామని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం చెల్లించని పక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు పేర్కొంటున్నారు.



గుడ్లవల్లేరు మండలంలో నీట మునిగిన వరి పంట పొలాలు

అధికారుల నిర్లక్ష్యమే..

ప్రధాన డ్రెయిన్లు పొంగి పంట పొలాలు ముంపు బారిన పడేందుకు డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే అని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు, పూడిక తొలగింపు పనులను టెండర్ల ద్వారా పనుల నిర్వహణకు అధికారులు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. అయితే కాంట్రాక్టర్లు సకాలంలో తూడు తొలగింపు పనులు చేపట్టకపోవడంతో పంట పొలాల్లో ఉన్న వర్షపు నీరు బయటకు పోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి చేసి కష్టం అధికారుల నిర్లక్ష్యం వలనే పంట నీటి పాలు అవుతుందని, దీనిపై ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కంద, పసుపు రైతులకు నష్టం



బాధితులకు ఆహార పొట్లాలను అందజేస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలంలోని కంద, పసుపు, చెరకు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని సకాలంలో వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. తోట్లవల్లూరు మండలంలోని పునరావాస కేంద్రాల్లో ఉన్న వరద బాధితులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రొయ్యూరు నుంచి ఐలూరు వరకు కంద, పసుపు అరటి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. రైతులను ఆదుకునేది పంట బీమా పథకం తప్ప మరో మార్గం లేదన్నారు. నష్టపోయిన రైతులందరికీ ఖరీఫ్‌లో తీసుకున్న పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. శ్రీ శ్రీనివాసా విద్యాసంస్థల అధినేత పరుచూరి శ్రీనివాసరావు, టీడీపీ బీసీ నాయకులు వెంకటగురుమూర్తి, సామాజిక కార్యకర్త రమణ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వండి



గుడివాడ టౌన్: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అల్పపీడనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా కృష్ణా జిల్లాలో 25 మండలాల్లో వరి, ఇతర పంటలు పూర్తిగా నష్టపోయాయని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేలు పరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. గుడివాడ, పరిసర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందన్నారు. పంటతో నిమిత్తం లేకుండా రైతును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు రోజులుగా పంటపొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో అది పూర్తిగా కుళ్లిపోతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు ఎస్.వెంకటకృష్ణారావు, ఆర్.కొండ, పి.ప్రసాదు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాల పరిశీలన



ఉరుటూరు(పామర్రు): భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ రంగారావు డిమాండ్ చేశారు. మండలంలోని ఉరుటూరులో నీట మునిగిన వరి పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఒక్కో రైతు ఎకరాకు రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. కౌలురైతు సంఘ మండల కార్యదర్శి లక్ష్మణరావు, కేవీపీఎస్‌జిల్లా నాయకులు విల్సన్, రజక సంఘ జిల్లా కార్యదర్శి నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

శాంతించిన కృష్ణమ్మ



తోట్లవల్లూరు పునరావాస కేంద్రాల వద్ద బాధితులకు భోజనం పెడుతున్న సిబ్బంది

పామర్రు(తోట్లవల్లూరు): ప్రజలను భయాందోళనకు గురి చేసిన కృష్ణమ్మ మంగళవారం కొంత శాంతించడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నిన్నటి వరకు 11.44 లక్షల క్యూసెక్కుల నీరు ఉన్న కృష్ణానది మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు 7.76 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. తోట్లవల్లూరు శివారుప్రాంతాలైన లంక గ్రామాల నుంచి తీసుకొచ్చిన వరద బాధితులను పునరావాస కేంద్రాల్లోకి చేర్చారు. వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకొస్తున్నాయి. తోట్లవల్లూరు మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు పునారావాస కేంద్రాల్లో ఉన్నవారికి సేవా సంస్థలు ఆహార పొట్లాలు, బిస్కెటు, పులిహోర ప్యాకెట్లు అందజేస్తున్నారు.

వైద్యశిబిరం పరిశీలన

పునరావాస కేంద్రంలో ఉన్న వారికి దుప్పట్లను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పంపిణీ చేశారు. బాధితుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

నీటిలోనే పంట పొలాలు

నాలుగు రోజులుగా వస్తున్న వరద నీరు కృష్ణానది పక్కనే ఉన్న పంట పొలాలను ముంచి వేసింది. తోట్లవల్లూరు మండలంలో వాణిజ్యపంటలైన అరటి, పసుపు, చెరుకు, కంద తదితర పంటలు ఇంకా నీటిలో ఉన్నాయి. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డీవై దాసు బాధితులను పరామర్శించారు. సహాయక చర్యలను ఉయ్యూరు ఆర్డీఓ రాజు, పామర్రు, తోట్లవల్లూరు, మొవ్వ మండల తహసీల్దార్లు రవికాంత్, కుసుమకుమారి, మస్తాన్‌రావు పర్యవేక్షిస్తున్నారు.

22 అడుగులకు చేరిన బుడమేరు నీటి ప్రవాహం



ఎంఎన్‌కే రహదారిపై ప్రవహిస్తున్న బుడమేరు

గుడివాడరూరల్: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు బుడమేరు మంగళవారానికి 22 అడుగుల మేర చేరింది. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే బుడమేరు పరివాహక గ్రామాలైన చిన లింగాల, ఒద్దుల మెరక, చేదుర్తిపాడు, పుట్టగుంట, పెద లింగాల, అరిపిరాల గ్రామాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ముంపు ప్రాంతాల్లో టీడీపీ నాయకుల పర్యటన

నందివాడ మండలం బుడమేరు పరివాహక ముంపు బాధిత గ్రామాల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశాల మేరకు ఆయన సోదరుడు కామేపల్లి తులసీబాబు, టీడీపీ నాయకులు మంగళవారం పర్యటించారు. ప్రజలందరికీ అన్ని వసతులు కల్పిస్తామని నాయకులు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు కడియాల గణేష్, పంచకర్ల మహేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు



భోజనం ప్యాకెట్లు పంపిస్తున్న వ్యాన్ వద్ద తహసీల్దారు ఉదయ భాస్కరరావు

కైకలూరు: వరద బాధితులను ఆదుకునేందుకు ఆపన్న హస్తాలు ముందుకొస్తున్నాయి. కైకలూరు నియోజకవర్గం నుంచి 5,000 ఫ్రైడ్ రైస్ ప్యాకెట్లను మంగళవారం ఎన్టీఆర్ జిల్లాకు పంపించారు. నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోషియేషన్ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. అదేవిధంగా సోమవారం 30 వేల మందికి ఆహారాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా తయారు చేయించి, వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా కైకలూరు తహసీల్దారు ఉదయభాస్కరరావు మాట్లాడుతూ వరదబాధితుల సాయం కోసం ముందుకొస్తున్న దాతలు అభినందనీయులన్నారు.

డ్రెయిన్లకు మరమ్మతులు



కైకలూరు: వర్షాల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు యుద్ధ ప్రాతిపాదికన డ్రెయిన్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. తహసీల్దారు ఉదయభాస్కరరావు, వరద నియంత్రణ మండల ప్రత్యేకాధికారి, ఫిషరీస్ ఏడీ రాజ్‌కుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఈఓపీఆర్డీ రవిశంకర్, సెక్రటరీలు, వార్డు సభ్యులు డ్రెయిన్ల పరిస్థితిని మంగళవారం సమీక్షించారు.

వరి పొలాల పరిశీలన



మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో నీట మునిగిన వరి పొలాలలను వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, ఏఓ జరీనా రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు నీటిని బయటకు తోడేయాలని సూచించారు. వీఏఏ గోపాల్, వీఆర్ఏ ప్రసాదు, రాంబాబు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పామర్రు: మండలంతోని జమీగొల్వేపల్లిలో పేకాటరాయుళ్లను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు.జమీగొల్వేపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే రహస్య సమాచరం మేరకు సీఐ సుభాకర్ స్థానిక స్కూల్ వద్దకు వెళ్లారు. అక్కడ పేకాట ఆడతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకుని వారి దగ్గర నుంచి రూ.20,150ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అవినాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరుణపతాకం ఆవిష్కరణ



పామర్రు: స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద అమరవీరుల స్థూపం పై సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. స్థూపం ఏర్పడి 55 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు బరిగెల భీమేశ్వరరావు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 సెప్టెంబరు 3వ తేదీన పుచ్చలపల్లి సుందరయ్య ఈ అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. నాయకులు ఒడుగు గంగాధరప్రసాద్, ముళ్లపూడి విల్సన్, నాగభూషణం, శ్రీనివాసరావు, రఘునాథరావు పాల్గొన్నారు.

కోమండూరి చక్రవర్తికి డాక్టరేట్



గుడివాడ టౌన్: స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన శ్రీ గాయత్రి జాతక జ్యోతిష్యాలయ నిర్వాహకులు కోమండూరి చక్రవర్తికి ఆధ్యాత్మిక విభాగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. మంగళవారం ఆయన నివాసంలో డాక్టరేట్ పట్టాను విలేకరులకు ప్రదర్శించారు. అమెరికాకు చెందిన హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి ఈ డాక్టరేట్ డిగ్రీ పొందినట్లు పేర్కొన్నారు. హైందవ ధర్మాన్ని కాపాడేందుకు తమ పూర్వికుల నుంచి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిని పురస్కరించుకుని తనకు ఈ గౌరవం దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోవాడ చంటి, రషీద్, పండు, నాని, స్వామి, నరేంద్ర పాల్గొన్నారు.

తగ్గుతున్న నీటిమట్టం



మండవల్లి: పెదఎడ్లగాడి వంతెన వద్ద నీటిమట్టం తగ్గుతుందని డ్రెయినేజీ ఏఈఈ బి.ఇందిర పేర్కొన్నారు. ఈనెల రెండో తేదీన 12 అడుగులు ఉన్న నీటి మట్టం మంగళవారం 10.5 అడుగులకు తగ్గినట్లు తెలిపారు. రెండు పొక్లెయిన్లతో గుర్రపుడెక్కను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. పెదఎడ్లగాడి వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులను ఎంపీడీవో టీకే వెంకటరమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాల్, ఆర్ఐ హనుమాన్ పరిశీలించారు.

వానరాల దాడులతో ఆందోళన

వేములమడ(మొవ్వ): మొవ్వ మండలం వేములమడ ఎస్సీ కాలనీలో 10 రోజులుగా గ్రామస్తులపై వానరాలు దాడి చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందున్నారు. ఇటీవల ఘంటసాల మండలం యల్లమిల్లి-ఘంటసాల మధ్య ఇతర ప్రాంతాల నుంచి కోతులను వ్యాన్లలో తీసుకొచ్చి ఇక్కడ వదలడంతో కాలనీలో ఈ పరిస్థితి ఏర్పడింది. కూరపాటి కృష్ణమూర్తి, చప్పిడి ప్రభుదాసు, సాలి నాంచారమ్మ, దాసి నీలకంఠేశ్వరరావు తదితరులపై వానరాలు దాడులు చేశాయని గ్రామస్తులు తెలిపారు. సుమారు 40 కోతులు ఇళ్లలోకి చొరబడి కూరగాయలు, పండ్లు నాశనం చేస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోతుల నుంచి రక్షించాలని కోరుతున్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని నలు మూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి, స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ పలువురి దంపతులు పిల్లలకు అన్న ప్రాసన చేయించారు.

జాగ్రత్తలు పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చు



అడ్డాడలో ముంపునకు గురైన పొలాలను పరిశీలించిన ఏడీఏ స్వర్ణలత

అడ్డాడ(పామర్రు): నీటి మునిగిన వరి పొలాలను తగు జాగ్రత్తలు పాటిస్తే కాపాడుకోవచ్చని పామర్రు ఏడీఏ స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని అడ్డాడ, రిమ్మనపూడి, ఐనంపూడి, కొమరవోలు గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలాల నుంచి నీటిని వెలుపలకు పంపిన తర్వాత ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. దీంతో మొక్క సత్తువ తెచ్చుకుని ఎదుగుదల ప్రారంభిస్తుందని తెలిపారు. ముంపు నుంచి త్వరగా కోలుకుంటుందన్నారు. కోలుకున్న తర్వాత తెగుళ్ల రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం లేదా రెండు గ్రాముల కార్బండిజం, మంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. పామర్రు ఏఓ శివనాగరాణి , వీఏఏలు పాల్గొన్నారు.

విక్రయానికి వినాయక విగ్రహాలు



గుడివాడ టౌన్: వినాయక చవితి సమీపిస్తున్న సందర్భంగా వినాయక విగ్రహాలు విక్రయానికి సిద్ధమయ్యాయి. పట్టణంలోని బైపాస్ రోడ్ కరెంట్ ఆఫీస్ నుంచి నాగవరప్పాడు వంతెన, ఇంజనీరింగ్ కళాశాల వరకు ఈ విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. మూడడుగుల నుంచి తొమ్మిది అడుగుల విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. గృహ పూజలకు సంబంధించి రెండడుగులు విగ్రహాలు కూడా అందుబాటులో ఉంచారు. మూడడుగుల విగ్రహాలు ఒక్కొక్కటి రూ.నాలుగు నుంచి రూ. 5 వేలు, నాల్గడుగుల విగ్రహాలు రూ. 7 వేల నుంచి రూ. 9 వేల వరకు విగ్రహాల సైజులు, ఆకారాలను బట్టి రూ.25 వేల వరకు విగ్రహాలు విక్రయించనున్నట్లు వ్యాపారులు తెలిపారు.